క్లుప్తంగా

పోలింగ్ బూత్‌ల పరిశీలన



చనుగొండ్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శివశంకర్‌నాయక్

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో పోలింగ్ బూత్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ శివశంకర్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన విద్యుత్, ఫర్నీచర్, గదులు వంటి వాటిని పరిశీలించామన్నారు. పాఠశాలలో 199, 200, 201, 202, 203 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్‌లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని ఆయన తెలిపారు.

నేడు మున్సిపల్ సమావేశం

గూడూరు: గూడూరు నగర పంచాయితీ సర్వసభ్య సమావేశం చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ప్రసాద్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని ఆయన సూచించారు.

కేసీ కాల్వకు 189 క్యూసెక్కులు విడుదల

గూడూరు: సుంకేసుల డ్యామ్ నుంచి కర్నూలు నగర ప్రజలకు తాగు నీటి అవసరాల నిమిత్తం 189 క్యూ సెక్కుల నీటిని విడుదల చేసినట్లు శుక్రవారం డ్యామ్ అధి కారులు తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, డ్యామ్‌లో 0.917 టీఎంసీల నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

కల్లూరు: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీపీ బోయ శారద అన్నారు. శుక్రవారం లక్ష్మీపురం కస్తూర్బా బాలికల (మైనార్టీ) పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రిన్సిపల్ ఉమాదేవితో కలసి మధ్యాహ్నం అందిస్తున్న జగనన్న గోరుముద్దను పరిశీలించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించడంతో పాటు పౌష్టికాహారం అందించేలా నూతన మెనూ ప్రవేశ పెట్టారన్నారు. కార్యక్రమంలో సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి పాల్గొన్నారు.

నేడు పులకుర్తిలో గడప గడపకు మన ప్రభుత్వం

కోడుమూరు రూరల్ : మండలంలోని పులకుర్తి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డా.సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొనాలని ఎంపీడీఓ సూచించారు.

లద్దగిరిలో జగనన్న సురక్ష

అలాగే శనివారం లద్దగిరి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరై లబ్ధిదారులకు వివిధ రకాల సర్వీసులకు సంబంధించిన ధ్రువీకరణ సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు.

మోడల్ స్కూల్ తనిఖీ



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంఈఓ

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని మోడల్ స్కూల్‌ను శుక్రవారం ఎంఈఓ జ్యోతి తనిఖీ చేశారు. వంట గదిలో నిర్వాహకులు అన్నం వండేందుకు కట్టెలను ఉపయోగించడం గమనించి ఆమె మండిపడ్డారు. మధ్యాహ్న భోజనం తయారీకి గ్యాస్ పొయ్యిలనే వాడాలని ఈ సందర్భంగా ఎంఈఓ ఆదేశించారు. జగన్న విద్యాకానుక కిట్లను తీసుకున్న విద్యార్థుల బయోమెట్రిక్ అథెంటికేషన్ వంద శాతం పూర్తి చేయాలని పాఠశాల ప్రిన్సిపల్ వంశీమోహన్‌కు ఎంఈఓ సూచించారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని కల్లూరు ప్రాంతంలో చేపట్టే అభివృద్ధి పనుల కారణంగా శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఎస్టేట్ ఆపరేషన్స్ ఏఈ నాగప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కృష్ణానగర్, ఆదిత్య నగర్, శరీఫ్ నగర్, రాఘవేంద్ర నగర్, ఐటీసీ కాలనీ చుటు పక్కల ప్రాంతాల్లో ఉదయం 9:30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగనన్న సురక్ష పేదలకు రక్ష

● కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



లబ్ధిదారురాలికి కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు(న్యూటౌన్): జగనన్న సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు రక్షగా నిలుస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సాంకేతిక సమస్యల మూలంగా సంక్షేమ పథకాలు అందని అర్హులైను గుర్తించడంతోపాటు ప్రజలకు అవసరమయ్యే 11 రకాల సేవలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కర్నూలు మండల పరిధిలోని ఈ తాండ్రపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేకు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలబొకేలు, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వైపే దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రతినిధులు చూస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు 600 హామీలిచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసం చేశారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 98.5 శాతం అమలు చేసి బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మాజీ మండల ఉపాధ్యక్షుడు వాసు, సర్పంచ్ బాలపీర, సచివాలయ కన్వీనర్లు దానమ్మ, భాస్కర్, కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు, ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందించారు



జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలంటే కనీసం వారం పట్టేది. ప్రస్తుతం ఒక్కరోజులోనే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేయడం సంతోషంగా ఉంది.

–మాదిగ మద్దమ్మ, ఈ తాండ్రపాడు గ్రామం

ఒక్కరోజులోనే కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు



జగనన్న సురక్ష కార్యక్రమం కింద వలంటీర్ ఇంటి కొచ్చి దరఖాస్తు ఫారానికి కావాల్సిన పత్రాలు తీసుకెళ్లారు. ఒక్కరోజులోనే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. అధికారులకు కృతజ్ఞతలు.

– జి మాధవి, ఈ తాండ్రపాడు గ్రామం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అర్హతే ప్రామాణికంగా పార్టీలకు, రాజకీయాలు, కులమతాలకు అతీతంగా పేదలందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దటేకూరు గ్రామంలో జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మునిస్వామి, గ్రామ నాయకులు హనుమంతురెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని, ఎంపీపీ బోయ శారద ముఖ్య అతిథులుగా హాజరు కాగా గ్రామ నాయకులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని లబ్ధిదారులకు వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. గ్రామంలో ఎమైన సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని, సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా ప్రతినిధులందరం మీ ముందుకు వచ్చామని ఎమ్మెల్యే కాటసాని ప్రజలతో అన్నారు. రోడ్డును నిర్మించాలని, విద్యుత్ వైర్లు కిందికి ఉన్నందున ఇబ్బందిగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఎస్సీ కాలనీ వాసులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహితంగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు, గ్రామ నాయకులు గోపాల్‌రెడ్డి, కాంతారెడ్డి, ఖాజా బందెనవాజ్, మహేష్, మధు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలి



కార్యక్రమంలో డాక్టర్ దుర్గా ప్రసన్న బాబు

కల్లూరు: పాడి రైతులు పాల దిగుబడి పెంచుకోవడానికి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ దుర్గా ప్రసన్న బాబు సూచించారు. శుక్రవారం కల్లూరు మండలం బస్తిపాడు గ్రామ సచివాలయం దగ్గర పాడి రైతులకు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ సహకారంతో పశుగ్రాస వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ దుర్గా ప్రసన్న బాబు, ఆదోని ఉపసంచాలకులు డాక్టర్ పి. వెంకటరమణ ముఖ్య అతిథులుగా హాజరై పాడి రైతులకు నమూన పాశు గ్రాసల ఉపయోగాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ పశువులకు పోషక విలువలు ఉన్న ఆహారం అందించాలన్నారు. హెడ్జ్ లూసర్ అనే గడ్డిజాతిని గ్రామంలో చిన్నరాముడు అనే యువరైతు పొట్టేళ్లకు ఉపయోగిస్తున్న విషయం తెలుసుకున్న అధికారులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కల్లూరు, పత్తికొండ, గోనెగండ్ల సహాయ సంచాలకులు డాక్టర్ పి. పార్థ సారథి, డాక్టర్ రవి ప్రకాశ్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, కల్లూరు మండల పశు వైద్యులు శ్రీకాంత్ రెడ్డి,వెంకటసుబ్బయ్య, దీప్తి, మంజులూ బాయి, రైతులు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మీదివేములలో జగనన్న సురక్ష

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల, శకునాల గ్రామాలలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ శుక్రవారం ప్రకటించారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో భాగంగా శకునాలలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి బృందం, మీదివేములలో తన బృందం పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. కార్యక్రమాలకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తోట అనూష తెలిపారు. కర్నూలు మెడికోవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు స్థానిక కెనరా బ్యాంక్ సమీపంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భవన నిర్మాణాలపై పర్యవేక్షణ పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న రాముడు

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో వివిధ నిర్మాణ దశలలో ఉన్న ప్రభుత్వ భవనాలు, నాడు నేడు అభివృద్ధి పనుల నిర్మాణాలపై గ్రామ సచివాలయాల ఇంజినీర్ అసిస్టెంట్లు పర్యవేక్షణ పెంచాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏడుకొండలు, ఎంఈఓలు, ఇతర అధికారులతో కలిసి ఎంపీడీఓ ఇంజినీర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెండవ విడత నాడునేడులో భాగంగా జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయించాలని, హెచ్‌ఎంలు, పీఎంసీ సభ్యులతో ఇంజినీర్ అసిస్టెంట్లు రెగ్యులర్‌గా సమీక్షించుకోవాలని సూచించారు. అదేవిధంగా 15 గ్రామాలలో ఆర్బీకే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, పురోగతి ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంఈఓలు జ్యోతి, ఆదామ్ బాషా, ఏఈ గోసేనాయక్, సీఆర్పీలు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం ఈ తాండ్రపాడు గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని సర్పంచ్ బాలపీర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు, మండల కార్యదర్శి ఉసేనయ్య కోరారు. శుక్రవారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడు గ్రామంలో నిరసన తెలిపారు. అనంతరం కర్నూలు ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, ఎంపీటీసీ ఇందిరవరప్రభ

కోడుమూరు రూరల్: అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సూచించారు. మండలంలోని పులకుర్తి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసిన గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని, వీధిలైట్లు వేయించాలని, పాత మట్టి మిద్దెల స్థానం కొత్త ఇండ్లు నిర్మించుకునేందుకు గృహాలు మంజూరు చేయాలని చాకలి, ఉప్పరి, ముస్లిం వీధులకు చెందిన ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. అదేవిధంగా ఎయిర్‌టెల్ బ్యాంకు అకౌంట్లలోని డబ్బులను గుర్తు తెలియని వ్యక్తులు డ్రా చేస్తున్నారంటూ కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన వారందరికి పార్టీలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న జగనన్నను ప్రజలంతా ఆశ్వీరదించి గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఈలు గంగరాజు, లక్ష్మన్న, ఏపీఓ రమాదేవి, ఈఓఆర్డీ మంజుల, ఎంపీటీసీ సభ్యులు ఇందిరప్రభ, నాగరాజు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఇమ్మానేయులు, నాయకులు సత్యారెడ్డి, లక్ష్మన్న, గిడ్డయ్య, మాధవరావు, గిరి, నాగేంద్ర, సోమశంకర్‌యాదవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

● జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్ : ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశంలో లేవనెత్తిన సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ ఆధ్వర్యంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదకలను సభ దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ జయన్న మాట్లాడుతూ రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని, సర్వేకు అందరూ సహకరించాలని సూచించగా సర్వేయర్ ఎకరాకు రూ.3వేలు డిమాండ్ చేస్తున్నాడని ప్యాలకుర్తి ఎంపీటీసీ సాంతప్ప ఆరోపించారు. ఎవ్వరికీ రూపాయ ఇవ్వాల్సిన అవసరం లేదని, విషయాన్ని తన దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ చెప్పారు. గత ఏడాది ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు రూ.9కోట్లను ప్రభుత్వం బీమా పరిహారం మంజూరు చేసిందని ఏఓ రవిప్రకాష్ తెలిపారు. కోడుమూరు, గోరంట్ల, కల్లపరి, కొత్తూరు, లద్దగిరి, అమడగుంట్ల, పులకుర్తి, కల్లపరి గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి జలజీవన్ మిషన్ కింద రూ.4.24కోట్లు మంజూరైందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ సభ దృష్టికి తెచ్చారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పీఆర్ ఏఈ గంగరాజు తెలిపారు. అదేవిధంగా ఏపీఎం పుష్పావతి, ఏపీఓ రమాదేవి, ఎంఈఓ శరభయ్య, హెచ్‌ఓ మదన్‌మోహన్, ఏఈలు లక్ష్మన్న, సుజాత, ఈఓఆర్డీ మంజుల, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు రాముడు, కల్పన తదితరులు తమ తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను వివరించారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదని అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ సెంటర్ల పనితీరును బాగోలేదని, పర్యవేక్షించి నివేదికలివ్వాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించినా నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించిన ఆయన తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు మాధవి, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడిలా ఆదుకున్న వలంటీర్....



బీమా సొమ్మును అందజేస్తున్న వలంటరీ రఫీ, సచివాలయ సిబ్బంది (ఫైల్)

ఈ చిత్రంలో బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10వేలు అందజేస్తున్న వ్యక్తి కొడుమూరు మండలం, ప్యాలకుర్తి గ్రామ వలంటీర్ షఫీ. ప్యాలకుర్తికి చెందిన గడ్డం యూనూస్ అనారోగ్యంతో 2021లో కరోనా సమయంలో మృతి చెందాడు. పనులులేక అల్లాడుతుండగా, మరో వైపు ఇంటి పెద్ద యూనూస్ మృతి చెందడంతో ఆ కుటుంబం అయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోంది. వలంటరీ రఫీ ఇంటి వద్దకు వెళ్లి మృతుడి భార్య నసీమాబీకి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10 అందజేశాడు. అదేవిధంగా తన పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి తనవంతుగా అండగా నిలిచాడు. కరోనా కష్టకాలంలోనూ షఫీ చేసిన సేవలను ఆ గ్రామస్తులు నేటికీ గుర్తు చేసుకుంటూనే ఉన్నారు.

కష్టకాలంలో ఆదుకున్నాడు...



వలంటీర్ల సేవలు అందరికీ ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేకించి నా విషయంలో వలంటీర్ షఫీ కష్టకాలంలో ఆదుకున్న విషయం ఎప్పటికీ మరువలేను. భర్తపోయి ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో వైఎస్సార్ బీమా సాయం అందజేసి ఆదుకున్నాడు. తమను ఓదార్చుతూ వింతంతు పింఛన్ అర్జీ పెట్టించి అండగా నిలిచాడు. వైఎస్సార్ బీమా సొమ్ము మంజూరు చేయించి అండగా నిలిచాడు. ఫోన్ చేస్తే చాలు ఇంటి వద్దకు వచ్చి సేవలు అందజేస్తాడు. మనకు సంబంధం లేని వ్యక్తి ఇంతకంటే ఏమి చేయాలి. వలంటీర్ల సేవలను తప్పుపడితే పాపం మూటగట్టుకున్నట్లే.

–గడ్డం నసీమాబీ, ప్యాలకుర్తి గ్రామం, కోడుమూరు మండలం

కరోనా కాలంలో కష్టాలు తీర్చారు..



నిత్యవసర సరుకులు అందిస్తున్న వలంటరీ వీరబోయిన నాగసందీప్

ఈ ఫొటోలో నిత్యవసర సరుకులు అందిస్తున్న వీరబోయిన నాగ సందీప్ పాణ్యం సచివాలయం–3 పరిధి వలంటీర్. కరోనా కష్టకాలంలో తన పరిధిలోని కుటుంబాలకు అండగా నిలిచాడు. ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో ప్రభుత్వం అందజేసే సాయంతోపాటు దాతల నుంచి సేకరించిన నిత్యావసర సరుకులను అందజేసి అండగా నిలిచాడు. ప్రతిఒక్కరితో మాట్లాడుతూ ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీయండంతోపాటు ఏ మాత్రం సందేహం వచ్చినా వెంటనే కరోనా పరీక్షలు చేయించి మనోధైర్యాన్ని నింపాడు. వలంటీర్ల సేవలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు ఆయా కాలనీ ప్రజలు.

సేవలందించి అండగా నిలిచాడు...

వలంటీర్ల సేవలు అందరికీ ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేకించి కరోనా సమయంలో వారు చేసిన సేవలకు వెల కట్టలేం. కన్నా తల్లిందుడ్రలు, కుమారులు, కుమార్తెలు, బంధువుల కూడా ఒకరికొకరు సాయం చేయలేని పరిస్థితుల్లో వలంటీర్ అండగా నిలిచాడు. నిత్యావసర సరుకులతో పాటు ఆరోగ్యానికి సంబంధించిన మందులు ఇంటి వద్దకు వచ్చి అందజేశాడు. అన్ని కుటుంబాలకు పెద్దదిక్కుగా నిలిచిన వలంటీర్ల సేవలు ఎప్పటికీ మరవలేం. – చౌడేశ్వర రావు, పాణ్యం

హత్యకేసులో నిందితుల అరెస్టు

కర్నూలు: మండల పరిధిలోని పసుపుల గ్రామ పంచాయతీ మజరా గ్రామం నూతనపల్లెలో రైతు దండు ఆరోగ్యస్వామి హత్యకేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. పొలం తగాదా విషయంలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదం హత్యకు దారి తీసినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. హతుని సోదరుడి కుమారులు దండు రాజశేఖర్, దండు ప్రవీణ్ కుమార్, వారి తల్లి సుజానమ్మ తదితరులను శుక్రవారం ఉదయం వెంకాయపల్లె గ్రామ శివారులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజ్ దగ్గర ఉన్న బస్టాప్ వద్ద అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీరాం ఎస్‌ఐలు రామయ్య, మన్మథ విజయ్‌లతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. హతుడు ఆరోగ్యస్వామికి ముగ్గురు సోదరులు కాగా వారికి పెద్దల నుంచి సంక్రమించిన భూమి పంపకాల విషయంలో గొడవలు జరిగి హత్యకు దారి తీసినట్లు సీఐ వెల్లడించారు.

ఎన్‌సీడీ సర్వే లక్ష్యాలు సాధించాలి

కర్నూలు(హాస్పిటల్): నాన్ కమ్యూనికబుల్ డిసీజ్(ఎన్‌సీడీ), కమ్యూనికబుల్ డిసీజ్(సీడీ) సర్వే లక్ష్యాలను వంద శాతం సాధించాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య అధికారిణి హేమలత చెప్పారు. కర్నూలులోని వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్యకేంద్రాల వైద్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే అధికారిణి హేమలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ అవసరమన్నారు. దేశవ్యాప్తంగా ఒకే ఐడీ నంబర్‌తో రోగి ఆరోగ్య పరిస్థితిని ఆన్‌లైన్ చేస్తారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సచివాలయంలో హెల్త్ ఐడీ కార్డుకు ఆధార్‌కార్డు లింక్ చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అసాంక్రమిక వ్యాధులైన రక్తపోటు, షుగర్, క్యాన్సర్, గుండె జబ్బులు, స్ట్రోక్ మొదలైన వ్యాధులు గుర్తించడం, నిర్ధారించడం, యాప్‌లో అప్‌లోడ్ చేయడం, ఫాలో అప్ చేయడం వంటి వాటిపై వైద్యులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీపీఎంయూ డాక్టర్ ఉమా, డీపీవో విజయరాజు పాల్గొన్నారు.

వందశాతం రాయితీపై సూక్ష్మపోషకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సూక్ష్మపోషకాలైన జింక్, జిప్సంను వందశాతం, పిల్లిపెసర, జీలుగా యాభై శాతం రాయితీపై అందజేయడం జరుగుతుందని ఏఓ మల్లేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన సి.బెళగల్‌లోని మండల వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలను 50 శాతం సబ్సిడీతో అందించడం జరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా కొత్తగా రైతుభరోసా పథకానికి అర్హులైన వారు సంబంధిత పత్రాలతో ఆర్బీకేలలోని వ్యవసాయ సిబ్బందిని ఈనెల 18వ తేదీ లోగా సంప్రదించి పేర్లను నమోదు చేయించుకునేలా మండల ప్రజలకు తెలియజేయాలని మండలి సభ్యులకు సూచించారు.

అనుమతుల విత్తనాలనే అమ్మాలి:

రైతులకు ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను నిర్ణీత ఎంఆర్పీ ధరలకే అమ్మకాలు జరపాలని ఏఓ మల్లేష్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీఈఓలు వెంకటేష్, ఈశ్వర్, వీఏఏస్ బిందు, అంజలి తదితరులు పాల్గొన్నారు.